నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మణికొండ: మరమ్మతు పనుల కారణంగా గురువారం కోకాపేట, నార్సింగి, ఇబ్రహీం బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సెరినిటీ అపార్ట్‌మెంట్స్, ఉదయ్‌నగర్ కాలనీ, రెడ్డి బస్తీ, ప్రభుత్వ పాఠశాల, డీపీఆర్ అపార్ట్‌మెంట్స్, ఎర్త్‌వుడ్ అపార్ట్‌మెంట్, రాజపుష్ప, వెస్ట్ అవెన్యూ విల్లాస్, ఓపెన్ స్కై విల్లాస్, వెర్టెక్స్, కోకాపేట గ్రామం, లాంజావ్ అపార్ట్‌మెంట్, జెస్విత లగ్జరీ అపార్ట్‌మెంట్, కోకాపేట 60,80 గజాల కాలనీలు, రాజీవ్‌గృహకల్ప, గ్రీన్ బ్లాస్సామ్స్ అపార్ట్‌మెట్, ఈడెన్ గార్డన్, పాలోమి ఆరిస్టోస్, అల్లూరా నార్త్ స్టార్స్ విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు బృందావన్ కాలనీ, 7హిల్స్, అల్లు స్టుడియో, వెస్ట్రన్ మెడోస్, కృష్ణ గోశాల, ఎన్‌సీసీ అపార్ట్‌మెంట్స్, రాందేవ్‌గూడ, ఇబ్రహీంబాగ్, నార్సింగి రోడ్డు, తారామతి బారాదరి మెయిన్‌రోడ్డు, వన్‌మోర్ నగర్, నెక్నాంపూర్ గ్రామం, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, ఈవీపీ కాలనీ, పయనీర్ ఎస్టేట్, వెంకటేశ్వ రకాలనీలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

డప్పుల వితరణ



కృష్ణమాదిగకు డప్పులను అందజేస్తున్న ట్రస్టు చైర్మెన్

మణికొండ: మంచిరేవులకు చెందిన సాయికుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించటంతో ఆయన పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ తరపున ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి 20 డప్పులను అందించారు. సాయికుమార్ జయబాబు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్‌లు సీహెచ్ ఉదయ్‌కుమార్, క్రాంతి కుమార్‌లు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్ ప్రాంతానికి చెందిన మహేందర్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా ఇస్తుందని అన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా జెబ రెహమాన్



నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా రాజేంద్రనగర్‌కు చెందిన జెబ రహమాన్ నియమితులయ్యారు. ఇటీవల మొయినాబాద్‌లో ఎన్నిక జరగగా బుధవారం ఆమె కు పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్నిక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె నార్సింగిలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు మహిళా కాంగ్రెస్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు.

రంగరాజన్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ



రంగరాజన్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను కాంగ్రెస్ పార్టీ నేతలు బుధవారం పరామర్శించారు. దాడి అమానుషమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, ఎస్సీసెల్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల జగన్, మోహన్,కోటేశ్వర్, అంజనేయులు తదితరులున్నారు.

ప్రజాధనం రోడ్డుపాలు

- దెబ్బతిన్న రహదారులు
- మ్యాన్‌హోల్ మూతలు లేక స్థానికుల ఇబ్బందులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజాధనాన్ని కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టిన అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్‌లో ఇటీవల నిర్మించిన రహదారి, డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మ్యాన్‌హోల్స్ మూతలు సరిగ్గా అమర్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పనులను అధికారులు సరిగ్గా పరిశీలించకపోగా సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనుల పర్యవేక్షణ లేకుండా బిల్లులు చెల్లించడమేమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్స్‌ను అలా నిర్లక్ష్యంగా వదిలేస్తే ఏదైనా ప్రమాదం జరిగినపుడు ఎవరిది బాధ్యత అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్స్‌ను పట్టించుకోరు.. కనీసం వాటికి మరమ్మతులు కూడా చేయరు.. ఇలా అయితే ఎలా అని నిరసన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



బాబుల్‌రెడ్డినగర్‌లో మూతలు లేని మ్యాన్‌హోల్



నాసిరకంగా పనులు చేపట్టడంతో డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఆటో ట్రాలీ

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



విద్యుత్ ఫీడర్లను ప్రారంభిస్తున్న సీజీఎం పాండ్యానాయక్ తదితరులు

బండ్లగూడ: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యానాయక్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలో అదనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ఫీడర్లను రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ శ్రీరామ్‌మోహన్ తో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సత్కారం



కోకాపేటలో మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించిన ఉపాధ్యాయులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, అదనపు తరగతుల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులను చేపట్టామని నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ఎం.నాగపూర్ణశ్రీనివాస్, మాజీ వైస్ చైర్మెన్ జి.విజయ్‌బాబు అన్నారు. బుధవారం కోకాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వారిని ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జి.శివారెడ్డి, ఎ. దుర్గేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఉచిత వైద్య శిబిరం

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ఉద్యోగుల నిమిత్తం మూడు రోజుల ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నరసింహులు ప్రారంభించారు. చైతన్య స్వాస్థ్య క్లబ్, యశోదా ఆసుపత్రుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్టూడెంట్ అఫైర్స్ బి.లింగారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న సీబీఐటీ ఉద్యోగులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



హైదర్‌గూడలో ట్రాఫిక్ దిమ్మెలను ఏర్పాటు చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

అత్తాపూర్: వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచాతప్పకుండా పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ సూచించారు. బుధవారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రాంతంలో ప్రమాదకరంగా మారిన టర్నింగ్‌ను మూసి వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను నివారించేందుకు దిమ్మెలను పెడుతున్నామన్నారు. యూటర్న్‌ల వద్ద వాహనాదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఆహారంలో మిల్లెట్స్ భాగమవ్వాలి

ఐసీఏఆర్–ఐఐఎంఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి



డైరెక్టర్ తారా సత్యవతికి జ్ఞాపికను అందిస్తున్న వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రతిరోజూ అందరూ మిల్లెట్స్ తినే అలవాటు చేసుకోవాలని ఐసీఏఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సి. తారాసత్యవతి సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్‌ఐనుల్ హసన్ అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి కోసం మొక్కలు–మానవ పరస్పర చర్యలు' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవాలన్నారు. వైస్‌చాన్స్‌లర్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ జీవితంలో మొక్కల ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్, కన్వీనర్ డాక్టర్ ఇరాఖాన్ మాట్లాడుతూ స్థిరమైన మానవాభివృద్ధిలో మొక్కలు కీలకమన్నారు. డీన్ ప్రొ.అలీమ్ బాషా, ప్రొఫెసర్లు ఫజల్‌ఉర్ రహమాన్, పర్వీన్ జహాన్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు 'అబ్‌స్ట్రాక్ట్ పుస్తకం, గఫూర్ అన్ నిసా రచించిన ఫ్లోరా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: మండలంలోని చౌదరిగూడ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని బుధవారం గ్రామస్తుడు శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జీఓ 111 నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

ఆస్తిపన్ను పెంపు ఆమోదయోగ్యం కాదు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్నును పెంచడం ఆమోదయోగ్యం కాదని, చట్టాలు దానికి సమ్మతించవని, ఆ విషయాన్ని పునః పరిశీలించాలని సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవికి బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. బుధవారం సీడీఎంఏ కమిషనర్ కార్యాలయంలో కలిసి మణికొండలో పెంచిన పన్నుల వివరాలను వివరించారు. పన్ను పెంచే ముందు ప్రజలకు నోటీసులు ఇవ్వాలనే కనీస నిబంధనను పాటించలేదన్నారు. గత సంవత్సరం ఎర్లీబర్డ్ పథకంలో మొత్తం పన్ను చెల్లించినా దాన్ని ఆరు నెలల వరకే తీసుకుని మిగతాది బకాయిగా చూపుతున్నారన్నారు. వాటిని పునః పరిశీలన చేసి పన్ను భారాన్ని తగ్గించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 2023 నుంచి వేతనాలు పెంచకపోవటంతో పెరుగుతున్న ధరలతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీతాన్ని రూ.24లకు పెంచాలని కోరామని అధ్యక్షుడు డి. సీతారాం తెలిపారు. మున్సిపాలిటీకి ఇటీవల స్టాంపు డ్యూటీ ద్వారా రూ. 230 కోట్లు వచ్చాయని వాటితో రోడ్ల విస్తరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె. ధన్‌రాజ్, జి. నరేందర్, పి. రూపారెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్ రావు, జి.విఠల్ పాల్గొన్నారు.

సమతా కుంభ్‌లో విష్ణు సహస్ర నామ సామూహిక పారాయణం



శంషాబాద్ రూరల్: ముచ్చింతల్‌లోని సమతా స్ఫూర్తి కేంద్రంలో కొనసాగుతున్న సమతాకుంభ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర సామూహిక పారాయణం నిర్వహించారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఉదయం సుప్రభాతం, అష్టాక్షరీ మంత్ర జపం, ఆరాధన, సేవాకాలం, హోమాలను జరిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని మానసహిల్స్‌లోని సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఉదయం ప్రత్యేక పూజలతో అమ్మవారిని గద్దెలపైకి తీసుకువచ్చారు. శివసత్తులు, యువతీ యువకుల ఆటపాటల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం భారీగా వచ్చిన భక్తులు అమ్మవారికి బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక శాసన సభ్యులు ప్రకాశ్ గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



జాతరలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

రాజేంద్రనగర్: చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉప్పరపల్లిలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ అధ్యక్షుడు శ్యాంబాబు మాట్లాడుతూ.. తమ సంస్థ అనేక చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాల ప్రదర్శకులు సామ్‌గుండి మాట్లాడుతూ.. వైద్యం భారంగా మారిన ఈ రోజుల్లో నిరుపేదలకోసం శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రవణ్ పాల్గొన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లు సీజ్

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న రెడీమిక్స్ ప్లాంట్లను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. గత కొన్నేళ్లుగా పర్యావరణ, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఔటర్ రింగురోడ్డు, హిమాయత్‌సాగర్ చెరువును ఆనుకుని పెద్ద సంఖ్యలో రెడీమిక్స్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. ఇటీవల వీటి సంఖ్య పెరుగుతున్న కారణంగా స్థానికులు, పర్యావరణ వేత్తలు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్ఐ కృష్ణ సిబ్బంది ప్లాంట్లను పరిశీలించి సీజ్ చేసి సీల్ వేశారు. అక్రమంగా ప్లాంట్లు కొనసాగితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్ దత్ ఈ సందర్భంగా హెచ్చరించారు.



ప్లాంట్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



మంచినీటి సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి తదతరులు

బండ్లగూడ: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి కోరారు. బుధవారం జలమండలి జీఎం మహేందర్‌నాయక్, మేనేజర్ శ్రీనివాస్‌లతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటించారు. అధికారులు సమస్య తీవ్రతను పరిగణంలోకి తీసుకొని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

భారతీయ విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత ఉంది



సదస్సులో పాల్గొన్న అతిథులతో వీసీ ఐనుల్ హసన్

'మనూ' వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: నైతిక విలువల ఆధారిత విద్య కారణంగా భారతీయ విద్యావ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ, ఎంఎంటీటీసీ, ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, బీహెచ్‌యూ, వారణాసి, యూపీ, లెర్న్ టు లీడ్ సంస్థ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత మేధస్సు, దాని శక్తి ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యావేత్తల అవసరాన్ని గుర్తించాలన్నారు .న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంటల్ స్టడీస్ గౌరవ ఆచార్యుడు వి సుధాకర్ మాట్లాడుతూ మానవ ఆలోచనలను శక్తివంతం చేయడంలో సాంకేతిక ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జీవి మధుసూదన్, డాక్టర్ రావుల కృష్ణయ్య ,ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు ప్రసంగించారు.

ఆక్రమణల తొలగింపు..

రోడ్లు, ఫుట్‌పాత్‌లు తిరిగి ఆక్రమిస్తే చర్యలు: అధికారులు



మియాపూర్ జాతీయ రహదారి ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది

మియాపూర్: చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రోస్టేషన్ నుండి బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను బుధవారం జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. జాతీయ రహదారిపై ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయంతో బాటు పాదచారులు రోడ్డుపై నడుస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మియాపూర్ జాతీయ రహదారి ఇరువైపులా, మియాపూర్–బొల్లారం రోడ్డులోని ఫుట్‌పాత్ ఆక్రమణలను మియాపూర్ పోలీసుల బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో ఆక్రమణలను తొలగించారు. డబ్బాలు, తోపుడు బండ్లు, షెడ్లు, ఫర్నీచర్ దుకాణాలను తొలగించారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ఫర్నీచర్ దుకాణాలను తీసివేయాలని నిర్వాహకులకు సూచించారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లను తిరిగి ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో మియాపూర్ సీఐ క్రాంతికుమార్, ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

